


# క్షీరసాగర మథనం

– నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

25

౦కేయ్ మాన్ ద్వీపాలు

అక్టోబర్, 2014

**విశ్వం శుక్రవారం** ఇంట్లోనుంచి పని చేయడం సౌకర్యం అయ్యింది. లక్ష్మికి, సీతకు బ్యాంక్ అకౌంట్లు, కట్ట వలసిన బిల్లులు, విల్లు, మిగతా వివరాలు చూపెట్టి అప్పగించాడు. ఆఫీస్ పని అయ్యిన వెంటనే, సాయంత్రం కారులో సూట్ కేసు లు తీసుకొని క్రూయిజ్ ఓడలుండే రేవు కు చేరి, కారు పార్క్ చేసి, ప్రయాణికులను చెక్ ఇన్ చేసే వరసలో లక్ష్మి, సీతతో కలిసి నిలబడ్డాడు విశ్వం.

ఏండ్ల తరబడి ఈ క్రూయిజ్ ఓడలు నడుపుతున్న కంపెనీ మొత్తం ప్రయాణాన్ని సులభతరం చేసేసింది. అలా లైను లో నిలబడ్డ విశ్వం కుటుంబం నుంచి సూట్ కేసులు తీసుకొని వాళ్ళ ఓడ మీద ఉన్న వాళ్ళ రూములకు చేర్చి, వారి పాస్పోర్ట్ లు చెక్ చేసి వారికి ఓడలో నిమిషాలలో ప్రవేశమిప్పించింది.

ఓడ ప్రవేశించిన వెంటనే ఓ పెద్ద స్విమ్మింగ్ పూల్, ఆ పూల్ అటువైపు రెస్టారెంట్స్ ఉన్నాయి. అప్పటికే ఓడలో ప్రవేశించిన ప్రయాణికులు చేతిలో వెల్కమ్ డ్రింక్స్ పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ప్రదేశాన్ని, తోటి ప్రయాణికులను పరిశీలిస్తున్నారు.

ఓడ మొత్తం తిరగాలంటే ఓ పెద్ద సిటీ మొత్తం తిరిగి నట్లే ఉంది. లగేజీ ఎలా రూంకి చేరిపోయి ఉంటుంది. ఇప్పుడిప్పుడే రూంలకి పోవాల్సిన అవసరం లేదు. విశ్వం, సీత, లక్ష్మీ లు, ఆలా రెస్టారెంట్స్, మాల్ షాప్స్ చూస్తుండగానే అందరి ప్రయాణికులను ఓడ పై డెక్ కు రమ్మని, ఓడ మధ్యలో ఆగిపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పారు. అది విన్న తరువాత లక్ష్మి దూరంగా తిరుగుతున్న యువతీ యువకులను కలిసి వస్తానని వెళ్ళిపోయింది.

విశ్వం, సీత అలా డెక్ మీదే నడుచుకుంటూ ఓడ చివర వచ్చారు. అక్కడ ఓ నాలుగైదు రౌండ్ టేబుల్స్ కుర్చీలు వేశారు. ఎవ్వరూ లేనందున, చివరగా ఉన్న టేబిల్ దగ్గర కూర్చున్నారు విశ్వం, సీత. కింద సముద్రంలో ఓ అంతులేని తెల్ల తీవాచి విరామం లేకుండా పరుస్తున్నట్లు, నడుస్తున్న ఓడ వెనక నురగలు ఓ అల్లకోలోలం సృష్టిస్తున్నాయి. దూరంగా ఆకాశం సంధ్య కు ఆయత్తమౌతూ, ఎఱ్ఱ వర్ణాలు పూసుకొంటున్నది.

అలా సూర్యాస్తమయం చూస్తూ ఉంటే అట్టే సమయం గడిచిపోయింది విశ్వం, సీతలకు. తిరిగి లక్ష్మిని కలుద్దామని, పూల్ వైపు పోతుంటే, ఓ కరియొకే థియేటర్ కనిపించింది. స్టేజి, మైకులు ప్రేక్షకులకు కుర్చీలు అన్నీ ఉన్నాయి కానీ మనుష్యులే లేరు. సీత గొంతు బాగుంటుంది కాబట్టి పాడమన్నాడు విశ్వం. తెలుగైతే పాడటం సులువు, ఇంగ్లీష్ తో కుస్తీలెందుకండి అంది సీత. విశ్వం పట్టు బడితే ఇద్దరికి ఇష్టమైన బీటిల్స్ పాట కరియొకే లో సెలెక్ట్ చేసుకొని, 'హే జూడ్..' పాడటం మొదలెట్టింది. సీత గొంతులో ఆ పాట ఆనందంగా వింటున్న విశ్వం కోరస్ వచ్చినప్పుడల్లా సీతతో పాటు 'న,న,నా..' అంటూ గట్టిగా పాడటం మొదలెట్టాడు. సీత బలవంతంగా నవ్వు ఆపుకుంటూ, పాట పూర్తి చేసి, విశ్వంతో కలిసి గట్టిగా నవ్వడం మొదలెట్టింది. మొత్తం థియేటర్ ఖాళీ, వీరువురు తప్పితే. వారి నవ్వు కూడా పాటలో భాగంగానే అనిపించింది ఇద్దరికి. అలా నవ్వుతున్న సీత ఒక్క సారి కన్నీళ్లతో ఏడవడం మొదలెట్టింది.

విశ్వం సీతను దగ్గిర తీసుకొని,"చీ ఏంటి ఇది. ఎందుకు ఏడుస్తున్నావు? నాకేమైనా అవ్వుతుందని భయ పడుతున్నావా", అన్నాడు.

"మీకేమి కాదని నాకు తెలుసు.రోజు దేవుని మొక్కుతూనే ఉన్నాను కదా. మీరే ఈ కాన్సర్ అని తెలిసినప్పటి నుంచి ఎదో లోకంలో ఉంటున్నారు. చాలా దూరం అయ్యిపోయారనిపిస్తున్నది. అన్ని విషయాలు, నాతో పంచుకోండి", వెక్కిళ్ళ మధ్య అంది సీత.

"అబ్బే అదేం లేదు సీత. ఆఫీసు కొత్త పొజిషన్ తీసుకున్నాను కదా. ఆ గోడవలే. ఇక క్యాన్సర్ విషయాలు నీతో పంచుకుంటూనే వున్నాను. పంచు కోనిదల్లా , ఒక వేళ నేను పోతే మీరు ఎలా మేనేజ్ చేసుకుంటారన్న బెంగే. మన బంగారం బాగా పైకి వచ్చింది. తన స్టార్ట్ అప్ కూడా మొదలెట్టింది. నీవు చదువుకున్నావు. ఆర్థికంగా సమస్య ఉండదు. మీరిద్దరూ ఎంత తొందరగా కొలుకుంటారు అని కొన్నిసార్లు ఆలోచనలు వస్తాయి. అప్పుడే కొంచెం బాధనిపిస్తుంది. నాకు ఇంకా బ్రతకాలని ఉంది సీత. మన బంగారం పిల్లలతో నువ్వు, నేనూ ఆడుకోవాలని ఉంది సీత", బాధగా అన్నాడు విశ్వం.

"ఇదిగో ఈమాత్రం మీ ఆలోచనలను, నాతో పంచుకుంటే చాలు. మీకు ఏమి కాదు. ఏమేమి ఈ పరిస్థితులలో చేయాలో అది చేస్తున్నాము. మీకు సర్జరీ చేసే అతను, ఈ దేశంలోనే పేరు పొందిన సర్జన్. మనకన్నీ కలిసే వస్తాయి", ధైర్యంగా అంది సీత.

చూడడానికి, పెలుసు గా ఉండే ఈ ఆడవారిలో ఎక్కడి నుంచి వస్తుంది ఈ విశ్వాసం, ధైర్యం అనుకుంటూ, విశ్వం సీతతో పాటు లక్ష్మిని వెదుక్కుంటూ డిన్నర్ కని బయలు దేరాడు.

మరుసటి రోజు లేచే సరికి, పడవ కేయ్ మాన్ ద్వీపంలో ఉంది. అప్పటికే ద్వీపంలో ఈ టూర్ ఆ టూర్ అంటూ ఓడలో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. లక్ష్మి స్కూబా డైవింగ్ పోతానని టికెట్ బుక్ చేసుకుంది. సీత, విశ్వంలు అలా తమంతట తామే ద్వీపంలో తిరుగాలనుకున్నారు.

అలా బీచ్ వెంబడి ఉన్న షాపులు చూస్తూ, టౌన్ సెంటర్ కి వచ్చారు విశ్వం, సీత.

విశ్వం,"సీత, ఇక్కడో అడ్రస్ వెదకాలి", అన్నాడు.

"మీ ఆఫీస్ పనేనా? హాలిడే కాబట్టి, ఇక్కడ ఉన్నపుడైనా కొంచెం రిలాక్స్ కావచ్చు కదండీ", అంది సీత. విశ్వం ఎలా తన మాట వినడని, సీతకు తెలుసు.

విశ్వం వెతుకుతున్న అడ్రస్ ఓ చిన్న పెంకుటింటికి దారి తీసింది. అక్కడ ఓ బడ్డీకొట్టులో ఒకతను టూరిస్టులకు అవీ ఇవీ సూవెనీర్ లు అమ్ముతున్నాడు.

విశ్వం అతనితో మాటలు వేసుకున్నాడు. రాబర్ట్ ఇచ్చిన అడ్రస్ చూపితే, అది ఆ పెంకుటిల్లు బయట పెట్టిన పోస్టల్ డబ్బాలలో ఒక దానికి చెందుతుంది అని చెప్పాడు.

"మరి ఈ డైరెక్టర్ ఫెర్డినాండ్ ఎవరూ?", అడిగాడు విశ్వం.

"ఫెర్డినాండ్ నేనే. పనామా దేశం నుంచి ఓ ఇద్దరు ఓ ఐదు ఏళ్ల క్రితం వచ్చారు. ఇక్కడ కొన్ని పోస్ట్ బాక్స్ లు ఏర్పాట్లు చేసి, తాళం చెవులు నాకు ఇచ్చారు. నేను ఇక్కడ పోస్ట్ బాక్స్ లో రోజు చెక్ చేసి, వచ్చిన ఉత్తరాలు పనామకి ఫ్యాక్స్ చేయాలి. పనామా నుంచి అప్పుడప్పుడు కొన్ని పేపర్లు వస్తాయి. వాటి మీద 'డైరెక్టర్' అన్న చోటల్లా, నేను సంతకం చేయాలి. ఈ రెండు పనులకు నాకు బాగానే జీతం ఇస్తున్నారు", అన్నాడు ఫెర్డినాండ్ నవ్వుతూ.

ఫెర్డినాండ్ ను ఓ పని ముట్టు లా వాడుతున్నారని విశ్వం కు తెలిసి పోయింది.

సాయంత్రం ఫార్మల్ డిన్నర్ తరువాత డెక్ మీద ఉన్న లౌంజ్ లో కూర్చున్నారు విశ్వం, సీత, లక్ష్మి.

లక్ష్మి తన డైవింగ్ గురించి, చూసిన కోరల్ రీఫ్ లు, వాటి చుట్టూ తిరుగుతున్న అందమైన రంగు రంగుల చేపల గురించి ఉత్సాహంగా చెప్పుతున్నది. విశ్వం అన్యమనస్కంగా ఉండడం చూసిందేమో

"నాన్న మీరు కూడా డైవింగ్ కు రావలసినది. ఏదో ఆలోచిస్తూన్నారు దేని గురించి?", అని అడిగింది.

విశ్వంకు లక్ష్మిని చూస్తే కూడా జాలి వేసింది. పిచ్చి పిల్ల, ఎంత బాధలో ఉన్నా, బయట పడదు. బింకంగానే తన నుంచి అప్పగింతలు వింది. తానూ ఎలా సెక్యూరిటీ లో ఎక్స్పర్ట్. పిరమిడ్ గ్రూప్ గురించి చెప్తే పోలా అనుకున్నాడు.

"బంగారు, పిరమిడ్ గ్రూప్ కంపనీ పేరు నీవు వినే ఉంటావు. నేనీ మధ్య పిరమిడ్ గ్రూప్ కంపెనీల మీద రీసెర్చ్ చేస్తున్నాను. వాళ్లు మనీ లాండరింగ్ చేస్తున్నారా లేదా అన్నది ప్రశ్న. నాకేమో చేస్తున్నారని అనుమానంగా ఉంది. కానీ ఋజువు చేయడం కష్టంగా ఉంది. ఇదిగో ఇవ్వాళ మధ్యాహ్నం కూడా ఓ కంపెనీ అడ్రస్ ఈ ద్వీపంలో ఉంటే పోయి చూసి వచ్చా. అక్కడ ఓ పోస్ట్ బాక్స్ తప్పితే, ఆ కంపెనీకి ఆఫీస్ కానీ ఉద్యోగులు కానీ లేరు. నా అనుమానాలు తీరే అవకాశం కనిపించడం లేదు", అన్నాడు విశ్వం.

"ఇంటరెస్టింగ్ గా ఉంది. వివరాలు చెప్పండి", అంది లక్ష్మి. వింటున్న సీత కూడా కుతూహలంగా కొంచెం నడుము ముందుకు వంచింది.

"మొదటినుంచి చెప్పనీ. పిరమిడ్ గ్రూప్ ను చెక్ చేయమని మా బ్యాంక్ లో చెప్పారు. పిరమిడ్ గ్రూపులో రెడ్ రాక్ కేసినో అని ఓ కంపెనీ లాస్ వేగస్ లో ఉంది. పిరమిడ్ రియల్ ఎస్టేట్స్ అని మరో కంపెనీ మయామీ లో ఉంది.

కేయ్ మాన్ ద్వీపంలో నుంచి రెడ్ రాక్ కేసినోకి డబ్బులు క్యాష్ రూపంలో కొన్ని మిల్లియన్లు ముట్టుతున్నవని నా అంచన. రెడ్ రాక్ ఈ క్యాష్ ను కేసినో విన్నింగ్స్ అంటూ చెక్, కార్డు రూపంలో ఈ కేయ్ మాన్ లో ఉన్న పోస్ట్ బాక్స్ అడ్రస్ లకి పంపిస్తున్నారు. ఈ పోస్ట్ బాక్స్ ల తాళం చెవులన్నీ ఒకని దగ్గరే ఉన్నాయి. అది ఇవ్వాళ మధ్యాహ్నం ఆ పోస్ట్ బాక్స్ వివరాలు వెదికితే, తెలిసింది.

బ్రిటిష్ వర్జిన్ ద్వీపంలో మరో కంపెనీ ఉంది. ఆ కంపెని కి, ఇక్కడ కేయ్ మాన్ లో ఉండే కంపెనీకి ఒక్కడే డైరెక్టర్. ఆ బ్రిటిష్ వర్జిన్ ద్వీపంలో ఉన్న కంపెనీ మయామిలో మిల్లియన్లు పెట్టి రియల్ ఎస్టేట్ కొంటున్నది. వారు కొన్న రియల్ ఎస్టేట్ మొత్తం పిరమిడ్ గ్రూప్ లోని వాళ్ళ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచే.

అంటే కేయ్ మాన్ ద్వీపం నుంచి పిరమిడ్ గ్రూప్ కి క్యాష్ పంపిస్తున్నారు. పిరమూడ్ గ్రూప్ తమ కేసినో కంపనీ ద్వారా క్యాష్ కు సరిపడ్డ కార్డ్స్, చెక్ లు కేయ్ మాన్ కంపెనీకి పంపిస్తున్నది. కేయ్ మాన్ కంపెనీ ఆ డబ్బు అందిన వెంటనే బ్రిటిష్ వర్జిన్ ద్వీపంలో ఉన్న కంపెనీ ద్వారా పిరమిడ్ గ్రూప్ నుంచే రియల్ ఎస్టేట్ కొంటున్నది. ఈ రియల్ ఎస్టేట్ డీల్ లో పిరమిడ్ కంపెనీకి ధారాళంగా, క్యాష్ ను లాండేరింగ్ చేసినందుకు, కమిషన్ అంద జేస్తున్నారని, నా అనుమానం", అన్నాడు విశ్వం.

సాంతంగా విన్న లక్ష్మి కి సమస్య ఎక్కడ ఉందో ఇట్టే అర్థం అయ్యిపోయింది.

"అంటే నాన్న, మీకు కేయ్ మాన్ కంపెనీ లాస్ వేగస్ కు క్యాష్ పంపిస్తున్నదని , కేయ్ మాన్ కంపెనీ కి, బ్రిటిష్ వర్జిన్ ద్వీపంలో ఉన్న కంపెనీతో సంబంధం ఉందని ఋజువు కావాలి. మిగిలిన వివరాలకు ఋజువు మీ దగ్గర వున్నాయి", అంది లక్ష్మి

విశ్వంకు లక్ష్మీ, అంత తొందరగా అర్థం చేసుకుని, సమస్యను అంత సులభంగా, క్లుప్తంగా వివరించడం ముచ్చట వేసింది. తన కూతురు అని కొంచెం గర్వంగా కూడా అనిపించింది.

"బంగారు కరెక్టు గా చెప్పవమ్మా", మెప్పుకోలుగా అన్నాడు విశ్వం.

"కొంచెం టైం ఇవ్వండి నాన్న. ఇప్పుడే 'ఫిన్ సెన్' కి ఓ ప్రాజెక్ట్ ఒప్పుకున్నా. అది ఓ వారంలో అయ్యిపోతుంది. వెంటనే మీరు చెప్పిన కంపెనీల వివరాలను నేను మీకు అందచేయడానికి ప్రయత్నిస్తాను", అంది లక్ష్మి .

"అన్నట్టు మరిచా నాన్న. ఇవ్వాళ డైవింగ్ కని పోతుంటే, ఓ యువ జంట తారస పడింది. ఇద్దరూ ఐవీ లీగ్ లో చదువుతున్నారు. అమ్మాయి వెరీ బ్రిలియంట్. కంప్యూటర్ సెక్యురిటి గురించి ఆ అమ్మాయికి చాలా మంచి అవగాహన ఉంది. జాబ్ కావాలంటే జాయిన్ అవ్వమని నా కంపెనీ కార్డు ఇచ్చా", అంది లక్ష్మి .

"మంచి పని చేసావు బంగారు. మన చుట్టూ మన కంటే తెలివైన వారుండటం ఎదగడానికి తొలి మెట్లు. ఇంతకీ ఈ యువ జంట, మనకు తెలిసిన వారేనా? ఎవరైనా కామన్ ఫ్రెండ్స్ ఉన్నారా?", అడిగాడు విశ్వం.

" కొత్త వాళ్లే నాన్న. అమ్మాయి పేరు ఆయష. అబ్బాయి అరసు అట. చూడడానికి క్యూట్ జంట", అంది లక్ష్మి .

–26 –

2014

- సహార చిట్ ఫండ్ 25 వేల కోట్ల కుంభకోణంలో సహారా చైర్మన్ ను అరెస్ట్

"నా చదువైపోయిన తరువాత వెకేషన్ ట్రిప్ అన్నావు. క్రూయిజ్ పోయి వచ్చాము. నెక్స్ట్ ఏంటి?", అంది ఆయష, అరసును చూస్తూ.

ఆయష ఇంజనీరింగ్ చదువు ముగించిన వెంటనే అమెరికా కు వచ్చేసింది. అరసు తెలుసు కాబట్టి బాస్టన్ లోని యూనివర్సిటీ కి అప్లై చేసింది. అరసు బాస్టన్ లోని హార్వర్డ్ లో చదువుతుండడం వల్ల, ఆయషా ను ఎయిర్పోర్ట్ లో రిసీవ్ చేసుకోవడం, ఇల్లు రెంట్ తీసుకోవడం, మొత్తానికి ఆయషా సులభంగా సెటిల్ కావడానికి అరసు సహాయం చేయగలిగాడు. చిన్ననాటి వారి స్నేహం, ప్రేమ గా మారడానికి ఎటువంటి ఆంక్షలు లేనందున వారిద్దరూ ఒకే అపార్ట్మెంట్లో ఉండడానికి పెద్ద సమయం  పట్టలేదు.

"ఏముంది, నాన్న ఇండియాకి వచ్చి పి.ఎల్.గ్రూప్ లో డైరెక్టర్ గా చేరి, వ్యాపార మెలుకువ లు తెలిసికొని, క్రమంగా నాన్న స్థానం తీసుకొని, పి.ఎల్. గ్రూప్ ను మరింత ముందుకు తీసుకెళ్లాలి అని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల గ్రూప్ సాంవత్సరిక అకౌంట్లు పరిశీలించి, ఆమోదించాలట. అప్పుడే బోర్డ్ డైరెక్టర్ గా నన్ను పరిచయం చేయబోతున్నారు. నీవు కూడా ఇండియా కి రావచ్చు కదా", అన్నాడు అరసు.

"అరసు, నాకు రావాలనే ఉంది. కానీ ప్రస్తుతం కాదు. నేను నాకంటూ ఓ మార్గం వెదుక్కోవాలి. ఇప్పటికే మేకిన్సీ, బాస్టన్ కన్సల్టింగ్ గ్రూప్  బిగ్ 4 కన్సల్టింగ్ కంపెనీలతో ఇంటర్వ్యూ లు అయ్యాయి. కొన్ని స్టార్ట్ అప్ కంపెనీలకు కూడా ఎందుకు పని చేయకూడదు అనిపిస్తుంది", అంది ఆయష.

"స్టార్ట్ అప్ కంపెనీలు రిస్క్ కదా. పేరున్న కన్సల్టింగ్ కంపెనీలకే పని చేయి. తరువాత ఇండియాకి వచ్చేయి. పెళ్లి చేసుకుందాం. ఆ తరువాత నీకు పని ఇష్టం ఉంటే చేయి", అన్నాడు అరసు.

"స్టార్ట్ అప్ రిస్క్ ఒప్పుకుంటాను. కానీ అలాంటి కంపెనీలలో పని చేయడం ఇప్పుడు నేనున్న పరిస్థితులలో ఇష్టంగా ఉంది. పెద్ద ఆంక్షలు ఉండవు, ఎంత సేపైనా, ఎప్పుడైనా పని చేయొచ్చు. ఇది వరకు లేని ప్రొడక్ట్ సృష్టించడంలో, దానిని మార్కెట్ చేయడంలో ఏదో కిక్ ఉంది. ఇక నీ వనట్టు, ఇండియాకి వచ్చి మీ కంపెనీలో జాయిన్ అవ్వుతానని నాకు ఆలోచన లేదు", అంది ఆయష.

తన మాటలతో ఆయష ను గాయపెట్టానా? అరసు కి అనుమానం వచ్చింది.

"పి.ఎల్. గ్రూప్ లో చేరడం ఇష్టం లేకపోతే సరే. నీకు కావాలంటే ఇండియాలోనే ఓ స్టార్ట్ అప్ నీ ద్వారానే మొదలెడదాం", అన్నాడు అరసు.

"హనీ, నీవు పూర్తిగా సెటిల్ కాలేదు. నువ్వు ముందు పి.ఎల్. గ్రూప్ లో పని చేసి సెటిల్ అవ్వు. నీవు ఒక్కడే పి.ఎల్.గ్రూప్ కి వారసుడు కాబట్టి ఆ గ్రూప్ నీకే చెందుతుంది. నీకు ఆ విషయంలో ఛాయిస్ లేదు. నువ్వు నన్ను పెళ్లి చేసుకోవడం లో అడ్డంకులు వస్తాయని నీకు, నాకు ఇద్దరికి తెలుసు. ఈ సమస్యలు పరిష్కరించగలిగినా, మన జీవితాలు ఆ నిర్ణయాల వల్ల ఎలా మారుతాయో తెలీదు. ప్రస్తుతం ఇండియాకి నువ్వు వెళ్లడం, నేను ఇక్కడే పని చేయాలనుకోవడం మాత్రం ఖచ్చితం. మన ప్రయాణాలు కొన్ని రోజులు ఇలానే విడి పోయి సాగానీ", అంది ఆయష.

"ఏంటి అలా చెప్పేసావు. అయినా పి.ఎల్.గ్రూప్ ఇప్పుడు మన దేశంలోనే పెద్ద కంపెనీ. ఐ ఐ ఎం క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో కూడా మా గ్రూప్ లో చేరడానికి ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్ ఎంతో ఆసక్తి చూపిస్తూ ఉంటారు. అంత ఎందుకు, సలీం కూడా తన పి జి తరువాత, పి.ఎల్. గ్రూప్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన టీచింగ్ హాస్పిటల్ లో ఆంకోలజీ డిపార్ట్మెంట్ లో ప్రొఫెసర్, డాక్టర్ గా చేరాడని నీకు తెలుసు కదా. ఇప్పుడు నాతో పాటు రావడానికి ఎందుకు సంకోచిస్తున్నావు?", అన్నాడు అరసు.

"నేను ప్రాక్టీకల్ గా మాట్లాడాను అరసు. ప్రస్తుతం మన నిర్ణయాలు మారే సూచనలు నాకు కనిపించడం లేదు. పరిష్కారానికి సమయానికి మించిన సొల్యూషన్ మరేదీ లేదు", అంది ఆయష.

ఆయష మాటల్లో నిజాయితీ ఉంది అని అరసుకి తెలుసిపోయింది. ఇది తమ బ్రేక్ అప్ కి నాందినా అన్న అనుమానం మొదలయ్యింది. కానీ ఆ మాట ఆయష మాటలలో విన నంత వరకు, అలా తను ఊహించుకోవడం కష్టం గా ఉంది. ఆయష లాగా తను ఎందుకు ఆలోచించ లేక పోతున్నాడు. తనకు కావాల్సినదెల్లా అడగకుండానే దొరకటం వల్లనా?

ఆ తరువాత వారం రోజులు ఆయాష, అరసు కలిసినా వారి మధ్య ఓ తెర పడినట్లే అనిపించింది. అది బాధ వలనా, లేక విడిపోవడానికి చేస్తున్న రెహార్సలా అర్థం కాలేదు అరసుకి. అరసును ఆయాష ఎయిర్పోర్ట్ లో డ్రాప్ చేసి నప్పుడు ఇచ్చిన హగ్ లో అరసు కి కొంత ఊరట కలిగించినా, తన మనస్సులోని ఆందోళన పూర్తిగా పోలేదు.

అరసు ఫ్లైట్ జినీవా వరకు ఉంది జినివాలో ఓ రెండు రోజులు మీటింగులు ఏర్పాటు చేసినట్లు మహేష్ ఫోన్ చేసి అరసుకి చెప్పాడు. ఆ విషయం అది వరకే పి.ఎల్. అరసుతో చూచాయగా చెప్పడం వల్ల అదో సర్ప్రైజ్ గా అనిపించలేదు.

ఫ్లైట్ జినీవాకి పొద్దున్నే చేరింది. జినీవా లో మహేష్ అరసును రిసీవ్ చేసుకొని హోటల్ కి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వరకు రెస్ట్ తీసుకోమని, లంచ్ లో తమ మొదటి మీటింగ్ లియో తో మొదలవ్వుతుందని చెప్పాడు. లియో గ్రూప్ వల్లే పి.ఎల్ గ్రూవుకి మొదటి ఎగుమతికి బ్రేక్ దొరికిందని నాన్నా వల్ల చాలా సార్లు వినడం వల్ల, లియో ను వాళ్ళ కుటుంబాన్ని, అప్పుడప్పుడు సరదాగా కలుస్తుండడం వల్ల, అరసుకి లియో ను కలవడం సంతోషంగా నే ఉంది. కాదంటే లియో తో బిజినెస్ మీటింగ్ ఇదే మొదటి సారి.

అరసు కొద్దిసేపు నిద్ర పోయి, మహేష్ ఫోన్ తో మేల్కొని లంచ్ కి రెడీ అయ్యాడు. మహేష్ అది వరకే చెప్పడం వల్ల ఫార్మల్ గా కోటు పాంటు వేసుకొని మహేష్ తో బాటు హోటల్ లోనే ఉన్న ఐదు రెస్టారెంట్లలో ఒకదానికి పోయాడు. లంచ్ కి ఈ రెస్టారెంట్ పాపులర్ ఉన్నట్టుంది. కొంచెం కిక్కిరిసే జనాలు ఉన్నారు. మహేష్ లియో పేరు చెప్తూనే, అషర్ వాళ్ళను కొద్దిగా లోపల, ప్రైవసీ ఉన్న ఓ టేబిల్ దగ్గరికి తీసుకెళ్లింది.

అక్కడ లియో, లియో వాళ్ళమ్మాయి, మరో ముగ్గురు కనిపించారు. లియో వాళ్ళ కుటుంబం, పి.ఎల్. వాళ్ళ కుటుంబం అప్పుడప్పుడు కలుస్తుండడం వల్ల పరిచయాలు అవసరం లేక పోయాయి. అరసు లియో ను, లియో వాళ్ళ అమ్మాయి లిజ్ ను కౌగలించుకొని పలకరించాడు. లిజ్ అరసు కంటే ఓ పది ఏళ్ళు పెద్ద. అందువలన, లిజ్ కు అరసు ఓ తమ్ముడు లాగా అనిపిస్తాడు. అరసు త్వరలోనే పి.ఎల్. గ్రూపు బోర్డ్ లో చేరుతున్నాడని విని లిజ్, లియో ఇద్దరూ సంతోష పడ్డారు. పి.ఎల్.గ్రూప్ ఇప్పుడు భారత దేశంలో పెద్ద కంపెనీలలో ఒకటి, అంతర్జాతీయంగా కూడా పేరు ఉన్న కంపెనీ. తోళ్ల బిజినెస్ నుండి తప్పుకున్నా, పి.ఎల్ గ్రూప్ కు లియో కంపెనీలకు, సంబంధాలు ఉన్నాయి. పి.ఎల్ గ్రూప్ కు అరసు వారసుడు కావటం తో లియో వాళ్ళ కంపెనీలు కూడా పి.ఎల్.గ్రూప్ ఎదుగుదలతో పైకి పోవచ్చునని లియో, లిజ్ ల అంచన.

మిగిలిన ముగ్గురు కొత్త వాళ్లలో, ఇద్దరు ఒక పనామా కంపెని కి చెందిన లాయర్లు. ఒకరు ఆ కంపెనీ ఓనర్. రెండవ అతను, ఆ కంపెనీ జినీవా నగర ఆఫీస్ మేనేజర్. వారిద్దరూ పి.ఎల్.గ్రూప్ కి కన్సల్టెంట్స్. అంతర్జాతీయ లావాదేవిలలో సలహాలు ఇస్తుంటారు. మూడో అతను ముడుతలు పడిన ముఖంతో, రాగి వర్ణం గడ్డంతో విలక్షణంగా కనిపించారు అరసుకి. అతను కూడా పి.ఎల్ గ్రూప్ కి కన్సల్టెంట్ అని హోల్బర్గ్ పేరని, మహేష్ పరిచయం చేశాడు.

అరసు చదువు గురించి, అతని కాలేజి జీవితం గురించి, లియో, పి.ఎల్. గ్రూప్ కంపెనీల గురించిన కబుర్లతో లంచ్ ఇట్టే గడిచి పోయింది. పనామా కంపెనీ లాయర్లతో అప్పుడప్పుడు పని పడుతూ ఉంటుందని, టాక్స్ విషయంలో వారి లాగా తెలిసిన వారు అరుదు అని మహేష్ అన్నాడు.

లంచ్ తరువాత మహేష్ తో కలిసి జినీవా అలా తిరిగి రూంకు వచ్చి పడుకున్నాడు అరసు. సాయంత్రం రూమ్ కె డిన్నర్ లైట్ గా తెప్పించుకుని తిని, ఆయష తో మాట్లాడి పడుకున్నాడు. ఆయష లంచ్ కి బయట వచ్చిందట.

మరుసటి రోజు, మళ్లీ మహేష్ తో కలిసి, కారులో బయలు దేరారు. మొదటి స్టాప్, అంతకు ముందు రోజు కలిసిన రాగి రంగు గడ్డం ఉన్న హాల్బర్గ్. అతని షాప్ మెయిన్ రోడ్ మీదే ఉంది. హాల్బర్గ్ వాళ్ళు వజ్రాల వ్యాపారం చేస్తున్నా, వారి షాప్ కు పోయింది వజ్రాలు కొనడానికి మాత్రం కాదని అరసు పసి కట్టి వేసాడు. దానికి కారణం మహేష్ అరసును తీసుకొని, ఆ షాప్ వెనుక ఉన్న ద్వారం ద్వారా, హాల్బర్గ్ ఆఫీస్ కు తీసుకెళ్లాడు. ద్వారం వెనుకనున్న హాల్ వే కి ఇరువైపులా రూములు ఉన్నాయి. ఆ హాల్ చివర హాల్బర్గ్ ఆఫీసు ఉంది. హాల్బర్గ్ కు అరసు రాక తెలిసినట్లే ఉంది.

మహేష్ తన వెంట తెచ్చిన ఓ క్రెడిట్ కార్డ్ లాంటి కార్డు అరసుకి ఇచ్చి, హాల్బర్గ్ చేతికివ్వమన్నాడు. హాల్బర్గ్ అరసు ముఖం వైపు తీక్షణంగా చూడటం అరసు గమనించాడు. ఆ రూమ్ లో ఉన్న దీపాలు కూడా, మామూలు కంటే కొంచెం ఎక్కువ కాంతితో మెరుస్తున్నట్లనిపించింది అరసుకి. హాల్బర్గ్ వారిద్దరిని ఆ ఆఫీసు రూమ్ లో ఉన్న సోఫాలలో కూర్చోమని, ఆ రూమ్ కి వెనుక నున్న ద్వారం తెరుచుకొని లోపలికి పోయాడు. ఇదేదో రైలు బండి కంపార్టుమెంట్ల లాగా ఉన్నాయను కున్నాడు అరసు. లోపలికి వెళ్లిన హాల్బర్గ్ అరసుకి, తాను ముందిచ్చిన కార్డు తో పాటు ఓ తాళం చెవి ఇచ్చాడు. పెద్ద మాటలు లేకుండా ఓ డ్రిల్ లాగా గడిచిపోయింది.

మహేష్ అక్కడి నుంచి అరసుతో బ్యాంక్ పోదామని కారు వైపు అడుగులు వేసాడు. కారులో హాల్బర్గ్ గురించి చెప్తూ, వాళ్లు ఒకప్పుడు బ్యాంకు లు నడిపేవారని, బ్యాంక్ లు కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించి న తరువాత హాల్బర్గ్ లాంటి కంపెనీలు సెక్యురిటి సేవలకు అంకితమైపోయాయి అన్నాడు మహేష్. హాల్బర్గ్ లాంటి వాళ్లు ఇలాంటి సదుపాయం చాలా తక్కువ మందికి చేస్తారు. కాబట్టి వాళ్ళు ముఖాలు బాగా పరిశీలించి, మెదడులో నిక్షిప్తం చేసేసుకుంటారు. ఇప్పుడు వారి చేతికి అందించిన తాళం చెవి మరో సెక్యురిటి. వజ్రాల వ్యాపారం కాబట్టి, వజ్రాల ద్వారా కూడా వారు డబ్బు ఒక చోటి నుంచి మరో చోట పంపి, నల్ల ధనం కూడా ట్రాన్స్ఫర్ చేయగలరు. ఈ సదుపాయాలను అందించినందుకు బాగానే చార్జీ చేసినా, పి.ఎల్. గ్రూప్ కి లాభమే. తాము రహస్యంగా దాచిన వస్తువులున్న బ్యాంక్ లాకర్ తాళం చెవి జినివాలోనే ఉండడం అవసరం.

మహేష్ వాళ్లు స్విస్ బ్యాంక్ చేరేసరికి బిజినెస్ సూట్ వేసుకొని మోడల్ లాగా ఉన్న ఓ కావిడ వేచి ఉంది. తాను పి.ఎల్. గ్రూప్ కి ప్రైవేట్ బ్యాంకర్ అని పరిచయం చేసుకుంది. మహేష్ తనను పరిచయం చేసుకుని, పి.ఎల్ గ్రూప్ వారసుడిగా అరసును పరిచయం చేశాడు.

మహేష్ చెప్పినట్లు అరసు హాల్బర్గ్ ఇచ్చిన తాళం చెవి ఆ ప్రైవేట్ బ్యాంకర్ కి చూపెడితే, లాకర్ గురించా అని, మహేష్, అరసు పాస్పోర్ట్ లు , అకౌంట్ వివరాలతో చెక్ చేసింది. 'ఫాలో మీ' అంటూ బేస్మెంట్ లో ఉన్న లాకర్ రూమ్స్ కి దారి తీసింది, ఆ ప్రైవేట్ బ్యాంకర్.

లాకర్ తీసి దాని లోనున్న బాక్స్ అరసు చేతికిచ్చి, పని అయ్యిపోయిన తరువాత అక్కడున్న ఫోన్లో పిలవమన్నది.

బాక్స్ లో ఉన్న వస్తువులు చూసి, అందులో ఉన్న పేపర్లు చదివి, తిరిగి అలానే లాకర్ లో పెట్టేసి రమ్మన్నాడు మహేష్.

"నువ్వు ఆ లాకర్ లో చదివిన పేపర్ల మీద, నీకో చిన్న క్విజ్. చదివిన తరువాత నీకూ చాలా ప్రశ్నలుంటాయని తెలుసు. లెట్ స్ డిస్కస్ ఆఫ్టర్ లంచ్" అన్నాడు మహేష్.

అరసు బ్యాంకర్ ఓపెన్ చేసిన లాకర్ లో ఉన్న బాక్స్ తీసుకొని బ్యాంకర్ చూపెట్టిన ఓ ప్రైవేట్ రూమ్ లో కూర్చొని బాక్స్ తెరిచాడు. అందులో కొన్ని వెల్వెట్ సంచులలో వజ్రాలు ఉన్నాయి. ఆ వజ్రాలు చూస్తే అవి ఇన్వెస్ట్మెంట్ కోసం కొన్న అతి ఖరీదైనవి, అని వెంటనే తట్టింది అరసుకి. మిగిలినవన్నీ కాగితాలే.

వాటిని తీసి చదివాడు. కంపెనీ షేర్ లు. రెండు విషయాలు వింతగా అనిపించాయి. ఆ షేర్ లు కేయ్ మాన్ ద్వీపం లోను, బ్రిటిష్ వర్జిన్ ద్వీపంలోను రిజిస్టర్ చేసిన కంపనీ లవి. చాలా మటుకు ఆ షేర్ లు బేరర్ షేర్ లు. అంటే ఎవరి దగ్గర ఆ షేర్ లు ఉంటే, వారే ఆ కంపెనీ యజమాని. ఇవన్నీ పి.ఎల్. గ్రూప్ కి కాక తమ కుటుంబానికే చెందుతుందని అర్థం అవ్వడానికి అరసును అట్టే సమ యం పట్టలేదు.

తన కోసమే అన్నట్లు ఈ ద్వీపాలలో రిజిస్టర్ అయ్యిన కంపెనీలు, ట్రస్ట్ వివరాలన్నీ కూడా ఓ ఫైలులో రాసి పెట్టారు.

ఈ కంపెనీల పేర్ల మీద లండన్, న్యూ యార్క్, మయామీ లాంటి నగరాలలో అపార్టుమెంట్లు, ఇండ్లు , యాట్ లాంటి పడవలు, బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయి. పి.ఎల్. గ్రూప్ రహస్యంగా దాచిన కొన్ని వేల కోట్ల ఆస్తులు, వివరాలు ఒక లాకర్ లో ఉండడం ఇదే అరసుకు తెలియడం.

అరసు లాకర్ లో పేపర్లు మళ్ళీ పెట్టేసి మహేష్ తో వెళ్లి హాల్బర్గ్ కు తన దగ్గరున్న కార్డు చూపెట్టి తాళం చెవి అప్పగించేశాడు.

అరసు కు ఇప్పుడు తమకున్న గుప్త ఆస్తుల గురించి అవగతమైపోయింది. మహేష్  ఈ ద్వీపాలలో కంపెనీలు, వాటిని మనేజి చేయడానికి నెలకొల్పిన ట్రస్టీ కంపెనీ వివరాలు చెప్పాడు, ఈ కంపెనీ డైరెక్టర్ లు , ట్రస్టీ లు ఆ పనామా లాయర్ లు వెదికి సంతకం పెట్టించిన బినామీ మనుష్యులు. చిరు ఉద్యోగులు. సంతకం ఎందుకు పెడుతున్నామో తెలియని మనుష్యులు. అందుకే అన్ని చోట్లా రెండు సంతకాలే కనపడ్డాయి. పి.ఎల్.గ్రూప్ పేరు కానీ పి.ఎల్. కుటుంబం పేరు కానీ పైకి పొక్కకుండా ఈ విడదీయరాని చిక్కు ముళ్ళు వేసిన పనామా లాయర్ల కు ప్రతీ సంవత్సరం కొంత డబ్బు కన్సల్టింగ్ ఫీస్ కింద ముట్టుతుంది, అని మహేష్ వివరించాడు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments